దుప్పటి!

ఉపద్రష్టసాయి

చలి. ఎముకలు కొరికే చలి. నరనరాలలోని రక్తాన్ని గడ్డ కట్టించేటంతటి చలి. శరీరాన్ని మంచు ముక్కలా మార్చిన చలి. దానికి తోడు తుంపర. ఈదురు గాలి. శీతాకాలం రాత్రి మనిషి జీవితంలోని సాయంసంధ్యలా మెల్లగా క్రమ్ముకు వచ్చింది. రాత్రి పన్నెండు గంటలు దాటింది.

సీతారామయ్యగారు నులక పట్టెక అటూ ఇటూ దొర్లుతూ, అప్పుడప్పుడు అవులిస్తూ మోకాళ్ళను, మోచేతులనూ దగ్గరికి చేర్చి కడుపులో అదిమి పెట్టుకుని, గాలికి వణుకుతూ రాలిపోయే పండుటాకులా కదులుతున్నారు. తన చుట్టూ ఎవరూ లేరు. ఒంటరి బ్రతుకు తనదని చెప్పకూడదు. తను పడుకున్న హాలుకు ఎదురుగుండా వున్న గదిలో తన కొడుకూ, కోడలూ నిద్రపోతున్నారు. చెప్పుకోడానికి బంధుత్వం వుంది.

అక్కడక్కడా చినిగినా చాప మీద తను. తన శరీరం మీద అక్కడక్కడా చినిగిన పల్చని చొక్కా. నష్టపోయిన వ్యాపారస్తుడి బతుకులా వుంది తన జీవితం. పది సంవత్సరాల క్రితం సావిత్రి పోయింది. ఎనిమిది సంవత్సరాల క్రితం ఒక కొడుకు పోయాడు. ఈ మధ్య కాలంలో తన ఆరోగ్యం చెడి పోయింది. రిటైరైపోవడంతో తన రెక్కలు తెగిపోయాయి.

ముసలితనం ఒక్కటే తను మిగుల్చుకో గలిగాడు. అస్థి తన ఆస్తి. రిటైరైన తర్వాత కూడా ఆరు సంవత్సరాలు స్వయంపాకం చేసుకుంటూ, ఊళ్ళో పిల్లలకు ట్యూషన్లు చెబుతూ గడిపాడు తను. కానీ ఇపుడు, తన కొడుకులాగానే తన శరీరం, తన వశంలో లేకపోవడంతో మరో గత్యంతరం లేక రామ్మూర్తి పంచన చేరాడు. రామ్మూర్తి తన కొడుకే.

గడిచే ప్రతి రోజూ తనను గమ్యం వేపుకు తీసుకుపోతున్నా జీవితం, ఈ దశలో ఎందుకిలా నత్తనడక నడవాలి అనుకుంటున్నాడు సీతారామయ్య. హాల్లో కిటికీకి రెక్కలు లేవు. ఈదురుగాలి పోరీసు తరుముతున్న దొంగలా దూసుకు వస్తోంది. పడుతున్న వాన తుంపర తాలూకు నీటిజల్లు నేల మీద పడి చిట్లి, అప్పుడప్పుడూ తన శరీరాన్ని సూదులతో పొడుస్తోంది. తను వణుకుతున్నాడు. వెచ్చగా కప్పుకుంటే, దుప్పటిలో వున్న వాడికి నిద్ర దొరికినంత హాయిగా వుంటుంది. అంతేకాదు ఒక దుప్పటి తనను స్వర్లోకానికి తీసుకుపోతుంది. తెగిపోయిన బంధుత్వాలు, రాలిపోయిన తన వాళ్ళు తనను క్షోభ పెట్టిన దానికన్నా ఈ చలి తనను మరింత క్షోభ పెడుతోంది.

గోడ గడియారం ముల్లు దెబ్బ తిన్న లేడిలా మెల్లగా కదుల్తోంది. మరి పడుకోలేని సీతారామయ్య మెల్లగా లేచి కళ్ళు నులుము కుంటూ కూర్చున్నాడు. హాల్లో నలుమూలలా కలియజూశాడు. ఎక్కడైనా కప్పుకోవడానికో గుడ్డ వుంటుందా అని వెతికాయి అతని కళ్ళు. కానీ లాభం లేకపోయింది. తనకు కావలసినది తప్ప మరేవో వున్నాయి. అతని మనస్సు ఆరాటపడుతోంది. తాయిలం కేసి ఆత్రతతో పరుగెత్తే పసివాడిలా అరవై దాటిన తను కప్పుకోవడానికి దుప్పటి కోసం వెతుకు తున్నాడు.

వర్షం జోరు మరింత పెరిగింది.

చిరుగుల చాప కింది భూమి చల్లగా తన శరీరానికి తగుల్తూ వాతలు పెడుతోంది. ఉబ్బసం పెరుగుతోంది. ఏకాంత వార్ధక్య సమరం చేస్తున్నాడు సీతారామయ్య. (ప్రస్తుతం చీకటి తనకు తోడు, చినుకు తన శత్రువు.)

ఎదురుగుండా గది తలుపులు మూసి వున్నాయి. వెళ్ళి ఆ తలుపులు తడితే, రామ్మూర్తి తలుపు తెరుస్తాడేమో! కప్పుకో డానికి ఒక దుప్పటి అడిగితే ఇవ్వకపోతాడా? వేటగాడి వలలో పడిన పక్షిలా ఆలోచిస్తున్నాడు తను. జాలరి వలలో పడిన చేపలా, మనసు విలవిలలాడుతోంది. ప్రస్తుతం వాన జల్లుకూ, చలికీ తట్టుకోలేని తన శరీరం, జలాశయంలో పడిన చక్కెర బొమ్మలా కరుగుతోంది.

తమాయించుకుని గదికేసి నడిచిన సీతారామయ్య క్షణం ఆగాడు. "ఈ రాత్రప్పుడు, భార్యతో పడుకుని నిద్రపోతున్న కొడుకును లేపితే వాడు కోపం తెచ్చుకుని తిడితే తను భరించగలడా. తండ్రి కష్టం తెలుసుకోకుండా, కొడుకు తిట్టిన తిట్లు చలికన్నా మరింత బాధ పెడుతుంది. అయినా, సర్దుకోవడానికి ప్రయత్నించడమే మంచిది'' అనుకున్నాడు సీతారామయ్య.

మరికొద్ది సేపయ్యాక మళ్ళీ చాప మీద వాలాడు. జీవితం మళ్ళీ మొదలుకొచ్చింది. బాగా అలసిపోయిన నరాలు సడలిపోయి, నీరసంతో నిద్రలోకి జారుతున్న సీతారామయ్యకు లీలగా గతం గుర్తుకు వస్తోంది. ఎన్నిసార్లు, ఎన్ని బక్కెట్లు తోడినా మళ్ళీ ఊటపడుతున్న బావిలాంటి తన మనసులో గత కాలపు జ్ఞాపకాలు మళ్ళీ కదులుతున్నాయి.

* * *

పాతిక సంవత్సరాల క్రితం, తను సింహాచలంలో ఉద్యోగం చేసుకుంటున్న రోజుల్లో, కొడుకు రామ్మూర్తి వయసు ఐదు సంవత్సరాలు. మంచి వయస్సులో వున్న తనకు ఇద్దరు పిల్లలు. మధ్య తరగతి కుటుంబీకుడి ఆదాయం తనది. ఇద్దరు పిల్లలతో సంసారాన్ని ఒడిదుడుకుల మధ్య నెమ్మదిగా లాక్కొస్తున్నాడు. శరీరంలోని శక్తి సడలక, వయసు ముదరక పోవడం మూలాన, జీవితంలో ఎప్పటికప్పుడు ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనగల ధైర్యం వుండేది.

ముట్టూ కొండల నడుమ తన నివాస స్థలం. దుబారా ఖర్చులు చెయ్యకుండా, తను కుటుంబాన్ని నడుపుకు వస్తూ వుండేవాడు. ఆ సమయంలో తన తల్లి పోయింది. అనకాపల్లిలో తండ్రి టీచరు ఉద్యోగం చేసి రిటైరై అప్పటికే ఐదేళ్ళయింది. కానీ కొడుకు ఇంట్లో కూడా వుండడానికి ఇష్టపడని ఆయన తన తల్లి చివరి రోజు వరకు అనకాపల్లిలోనే గడిపాడు. చివరికి తల్లి పోయిన తర్వాత ఒంటరి వ్యక్తిగా మిగిలిన ఆయన కొంత కాలం స్వయంపాకం చేసుకుంటూ గడిపారు. ఆస్తిపాస్తులు లేని ఆయన ఒక చిన్న పాకలో వుంటూ పిల్లలకు పాఠాలు చెబుతూ గడిపేవారు. మెల్లగా కాలచక్రం కదులుతూ వార్ధక్యంలో ఆయని పాదాన్ని చేరారాయన. తన కడుపు కోసం తను వండుకోవడం కూడా చేసుకోలేక పోయాడు.

అప్పటికే తను రెండు మూడు ఉత్తరాలు రాశాడు. అలా ఒంటరిగా వుండవద్దని, తనతో వచ్చి వుండమని. కానీ ఆత్మగౌరవం వున్న ఆయన తన మూలాన తన కొడుకు సంసారం ఇబ్బంది పడకూడదని ఎప్పటికప్పుడు 'మరి కొంత కాలం పోయాక వస్తానురా' అని రాసేవారు. నిజానికి, తన ఉత్తరాలలో ఆత్మీయత కన్నా, అభిమానం కన్నా చెయ్య వలసిన కర్తవ్యం నిర్వహించకపోతే బాగోదు అనే భావం గోచరించేది; సీతారామయ్యకు. ఆ పంచన తండ్రిని చేరదీయడానికి కూడా ఆలోచించే దశలో వున్నాడే తను.

కానీ చివరికి, మరి ఏకాకి బ్రతుకు బ్రతకడం కష్టం అనిపించినప్పుడు, సీతారామయ్యకు తండ్రి ఉత్తరం రాశాడు. శేష జీవితం కొడుకుతో గడపడానికి నిర్ణయించానని.

మరో వారం రోజులలో రాఘవయ్య గారు కేవలం రెండు ట్రంకు పెట్టెలతో కొడుకు గుమ్మంలో స్థిరంగా కాలు పెట్టారు. జీవితం వయసుతో బాటూ ముడుచుకు పోతున్నట్లు రాఘవయ్య జీవితం రెండు పెట్టెలకు పరిమితమై పోయింది. ప్రస్తుతం, వత్తి మాత్రం మిగిలిన ప్రొవ్వతి తను. కొడిగట్టిన దీపం. వృద్ధాప్యంలో కాలు పెట్టిన తల్లైనా, తండ్రైనా, చివరి దశలో, కొడుకు ఇంటికి వస్తే, ఆ కొడుకు మాత్రం ఏం సుఖపడతాడో అనుకున్నారు రాఘవయ్య. కానీ రాక తప్పలేదు. అంత్యకాలమాసన్నమైనదనడానికి గుర్తులు తనకు తెలుస్తున్నాయి. ఇష్టం వున్నా లేకపోయినా, తను ఒంటరిగా ఎక్కడైనా చనిపోతే, అనవసరంగా ఊరివాళ్ళు తన కొడుకును కోడలిని ఆడిపోసుకుంటారు. బ్రతికి చేసిన మంచికన్నా చచ్చి చేసిన చెడ్డే గుర్తుంటుంది. అందుకే రాఘవయ్యగారు సీతారామయ్య దగ్గరికి వచ్చారు.

ఆదరణ, ఆప్యాయత, అభిమానం, అనురాగం, రాఘవయ్య కొడుకు ఇంటికి వచ్చిన రోజు ఆయనను ఆకట్టేసింది. సంవత్సరాల వియోగం తర్వాత జరిగే సంయోగంలోని తీపి సముద్రమంత లోతుగా, ఆకాశమంత విశాలంగా వుంటుంది. కానీ తన తండ్రి నిరంతరం తనతోనే వుండిపోతున్నాడనే నిజం తనకు తెలిసినప్పుడు, ఆదరణ తక్కువ కాక పోయినా, అదనపు మర్యాదలు అనవసరమను కున్నాడు తను.

రోజుకో అదనపు ముడత పడుతున్న ముసలితనం.... నానాటికి కాంతిహీనమవు తున్న కళ్ళు.... నీరసమే ఊపిరిగా శ్వాసిస్తున్న రాఘవయ్య ఆ ఇంట్లో ఎవరికీ ఏమీ చేయలేని స్థితిలో మంచానికి పరిమితమయ్యాడు.

సంక్రాంతి మరో వారం రోజులుందనగా, ఆ రాత్రి తనకిప్పటికీ గుర్తుంది. ఇంటి ముందర వసారాలో నులక మంచం మీద తండ్రి పడుకున్నాడు. తను, భార్య, పిల్లలు లోపల గదిలో పడుకున్నారు. తన గది కిటికీ మూసినా, వసారాలోని తండ్రి దగ్గు వినబడుతుంది. ఆ వసారాకు కిటికీ లేక పోయినా, ఊచల జాలీ వుంది.

ఆ వసారాలో పడుకుంటే ఆరుబయట పడుకున్నట్టే వుంటుంది. జనవరి నెల.... ఎముకలు కొరికే చలి. వెచ్చగా గదిలో పడుకుని, దుప్పటి కప్పుకున్న తనకే చలిగా వుంది. తండ్రి వసారాలో నులక మంచం మీద దగ్గుతూ పడుకున్నాడు... కప్పుకోవడానికి కూడా ఏమీ లేదు. రాఘవయ్య చలికి తట్టుకోలేక విలవిలలాడుతూ మూలుగుతున్నాడు. లేచి, ఆయనకో పంచె కప్పి వస్తే బాగుంటుందనుకున్నాడు తను. కానీ లేవలేదు. సంక్రాంతికి తన ఇంటికి వచ్చిన తండ్రికి కొత్త పంచ, కండువా కూడా కొనలేదు. ఈ వయసులో ఆయనకెందుకివన్నీ అనుకున్నాడు. ప్రస్తుతం తను లేచి ఆయనకు దుప్పటి ఇవ్వాలి. నిజానికి తన దగ్గర మరో దుప్పటి లేదు. పంచెలు చలికి ఆగవు. ఇస్తే తన దుప్పటే ఇవ్వాలి. తను ఎంతో సేపు ఆలోచించాడు. చలికి తట్టుకోలేక సతమతమవుతున్న తను, ఎన్నో శీతాకాలాలకు ఎదురునిల్చి జీవితంలో చివరి దశలో వున్న తండ్రికి దుప్పటి ఇవ్వకపోయినా ఆయనకేమీ కాదనుకున్నాడు. పల్లెటూళ్ళో ఏ ఆచ్ఛాదనా లేకుండా కేవలం పంచె కట్టుతో ఆరుబయట పడుకునే తండ్రి, ఈ దశలో వెచ్చగా దుప్పటి కోరుకోడు అనుకున్నాడు.

తండ్రి గురించి ఆలోచించడం మానేసి నిద్రలోకి జారిపోతున్న తనకు, గుక్క తిప్పుకోకుండా దగ్గుతున్న తండ్రి దగ్గు శబ్దం వినబడుతోంది. తనకు లేచే ఓపిక లేదు. తన భార్య గాఢ నిద్రలో వుంది. అప్పుడు మేలుకున్న రామ్మూర్తి "నాన్నా! తాతయ్య విపరీతంగా దగ్గుతున్నారు....'' అన్నాడు. అలా అడగడంలోని అర్థం అప్పటికప్పుడు తనకు గోచరించలేదా.

"మందివ్వవా...'' "ఓదార్చవా...'' అని అడగకుండా అడిగాడు వాడు. కాసేపు దగ్గి తర్వాత సర్దుకుంటారని నిస్త్రాణంగా నిద్రలోకి జారిపోయాడు తను. మరికొంత సేపయ్యాక అనుకున్నట్లే దగ్గు కూడా ఆగింది. రెండో ఝాము దాటిన తర్వాత నిశ్శబ్దం విలయ తాండవం చేసింది. కోడి కూసినప్పుడు వాకిటి తలుపు తెరిచినప్పుడు కెవ్వుమని కేకవేసి తనను లేపింది సావిత్రి. గుమ్మం దగ్గర తండ్రి పడుకున్నాడు. లోపల గడియ వేసుకుని పడుక్కోవడం మూలాన... రాత్రి దగ్గి దగ్గి... మృత్యు దేవత ఒడిలోకి వాలి పోవడానికి ముందు కన్న కొడుకుతో ఒక్క మాట చెప్పి వెళ్దామని ఆయన లేచి తలుపు దగ్గరికి వచ్చి వుంటారు. కానీ గొళ్ళెం వేసి వుండడంతో, మళ్ళీ వెనక్కు తిరిగి వెళ్ళి మంచం మీద పడుక్కునే ఓపిక లేక, నడవలేక, గుమ్మం దగ్గరే వాలిపోయుంటారని తర్వాత తెలుసు కున్నాడు తను.

ఆనాడు... తన తండ్రి పట్ల తను చూపించిన ఉదాసీనత వల్ల ఆయన ఎంత బాధ పడి వుంటాడో ఈరోజు, రామ్మూర్తి వల్ల తను తెలుసుకుంటున్నాడు.... ఆలోచనా తత్పరుడైన సీతారామయ్య కొడుకు గది తలుపు చప్పుడవడం విని ఆశగా చూశాడు.

మసక చూపులకు ఏదో విగ్రహం లీలగా కదలడం కనిపించింది. నులుముకు చూశాడు కళ్ళను. రామ్మూర్తి. తనలో ఏదో ఆశ. తను ముడుచుకు పడుండం చూస్తే కొడుకుతనకో దుప్పటి కప్పుతాడనే ఆశ. పాతిక సంవత్సరాల క్రితం ఐదేళ్ళ వయసున్నప్పుడే తనతో "నాన్న... తాతయ్య దగ్గుతున్నా''రని చెప్పిన కొడుకు కనీసం తనకు ఒక దుప్పటి కప్పక పోతాడా? అనుకుంటున్నాడు సీతారామయ్య.

తుంపర జోరు పెరిగి వర్షం పెద్దదైంది. నరాలు, ఒకదాన్తో ఒకటి పెనవేసుకుంటూ బిగుసుకుపోతున్నాయి. రామ్మూర్తి తనకేసి చూస్తూ 'బాత్‌రూం'కేసి వెళ్ళాడు. సీతారామయ్యలో ఆశ.... వచ్చాక 'దుప్పటి' ఇస్తాడని ఆశ... మరో రెండు నిమిషాలతర్వాత బయటికి వచ్చిన రామ్మూర్తి మళ్ళీ తనకేసి చూస్తూ నడుస్తున్నాడు. తను గిజగిజలాడడం గమనించుంటాడని తనకు అనిపించింది. రామ్మూర్తి గదిలోకి వెళ్ళి మళ్ళీ తలుపులు బిడాయించాడు.

సీతారామయ్య మనసు చివుక్కుమంది.

తన పరిస్థితి తెలిసి.... తను పడుతున్న బాధను చూసి కనీసం తండ్రికి ఒక దుప్పటో, కప్పుకోడానికి ఒక గుడ్డో ఇవ్వాలన్న ఇంగితం వాడికి రాలేదు....స్వార్థపరుడు అనుకున్నాడు.

కానీ మరుక్షణం సీతారామయ్య మనసే సీతారామయ్యకు సమాధానం చెప్పింది. తన తండ్రి రాఘవయ్య పట్ల తను పాతిక సంవత్సరాల క్రితం చూపించిన నిర్లక్ష్యానికి, ఉదాసీనతకు, ఈనాడు తనకు కనువిప్పు కలిగింది. రామ్మూర్తికి కూడా కనువిప్పు కలగాలంటే మరో పాతిక సంవత్సరాలు గడవాలి.

కాల పురుషుడి జీవితంలోని ఋతువులే మానవ జీవితంలోని బాల్య, యౌవన, కౌమార, వృద్ధాప్యాలు, కాలచక్రం... జీవిత చక్రం పోటీ పడి తిరుగుతూ, గత కాలపు అనుభవాలను, భవిష్యత్తుకు పాఠాలుగా అందజేస్తాయి.

కథా రచయితలకు ఆహ్వానం

తెలుగువారి జీవనాన్ని, సంస్కృతిని సంఘర్షణని ప్రతిబింబించే కథలకు 'ఆదివారం ఆంధ్రజ్యోతి' ఆహ్వానం పలుకుతోంది.

మానవ జీవనంలోని వివిధ కోణాలమీద వెలుగు ప్రసరించే, ఆసక్తి కరమైన కథలకు ప్రాధాన్యత వుంటుంది. కథలు నాలుగు లేక అయిదు అరఠావులకు మించకూడదు. కనీసం 2,500 పదాలకు తగ్గక ఉండాలి! కథలు ఈ కింది చిరునామాకి పంపించాలి.

ఎడిటర్,
'ఆదివారం ఆంధ్రజ్యోతి' ఆంధ్రజ్యోతి దినపత్రిక,
బంజారా హిల్స్, రోడ్ నెం.3,
హైదరాబాద్- 500 034